క్లుప్తంగా

నీట్‌లో మెరిసిన ప్రవల్లిక..


మిత్తిరెడ్డి ప్రవల్లిక

మెరకముడిదాం: మొన్న ఏపీఈఏపీసెట్‌లో.. నిన్న నీట్‌లో చినబంటుపల్లి గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి ప్రవల్లిక ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ప్రవల్లిక నీట్ లో ఆల్ ఇండియా లెవిల్‌లో 6,788వ ర్యాంక్ సాధించి అందరి మన్ననలను పొందుతోంది. దీంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు విద్యార్థినిని అభినందించారు.

సత్తా చాటిన లిఖిత..


గవిడి లిఖిత

చీపురుపల్లి: నీట్ ఫలితాల్లో గవిడి లిఖిత ప్రతిభ కనబరిచింది. పట్టణంలోని కొత్త గవిడివీధికి చెందిన గవిడి లిఖిత 720 మార్కులకుగాను 546 మార్కులు సాధించి, ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 13,997 ర్యాంక్ సాధించింది. దీంతో లిఖితను తల్లిదండ్రులు నాగరాజు, భారతి, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా దేశమ్మతల్లి పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గజపతినగరం: మండలంలోని బంగారమ్మపేట గ్రామ దేవత దేశమ్మతల్లి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

యోగాతో ఆరోగ్యం


యోగాసనాలు వేయిస్తున్న శిక్షకుడు కోటేశ్వరరావు

శృంగవరపుకోట: యోగాతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని ప్రముఖ యోగా శిక్షకుడు కోటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని భర్తాపురం కల్యాణ ప్రసన్న వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో యోగాసనాలను ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాసనాలు నిత్యం సాధన చేయడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాండ్రేగుల ఈశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా...


గొభ్యాం కూడలి వద్ద శిథిలావస్థలో ఉన్న బస్ షెల్టర్

దత్తిరాజేరు: మండలంలోని గొభ్యాం కూడలి వద్ద బస్ షెల్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈమార్గంలో ఒక బస్సు సర్వీస్ ఉంది. ఈ బస్సు తో పాటు ఆటోల్లో నిత్యం వందలాది మంది ఈ జంక్షన్ నుంచి గజప తినగరం, విజయనగరం, పెదమానాపురంనకు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు, ఆటోలు వచ్చే వరకు ప్రయాణికులు ఎండలోనే ఎదురు చూడాల్సి వస్తోంది. బస్ సెల్టర్ ఉన్నప్పటికీ అందులోకి వెళ్లేందుకు ప్రయాణికులు బయపడుతు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్‌ను తొలగించి, ఆస్థానంలో కొత్తగా నిర్మిం చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటయ్యేనా..?

- ప్రతిపాదించిన భవనాలు నిరుపయోగంగా మారిన వైనం




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న తరగతి గదులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో సోంపురం జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ హయాంలో కూడా ఇదే హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల నాలుగు తరగతి గదుల్లో ఇంటర్ తరగతుల నిర్వహణకు ప్రతిపాదించారు. దీంతో అప్పట్లో ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ప్రతినిధులు వచ్చి పరిశీలించి వెళ్లారు. అయినా ఇంటర్ కళాశాల మంజూరు కాలేదు. అప్పటి నుంచి ఈ భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఈ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇంటర్ కళాశాల మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

గజపతినగరం రూరల్: మత్తుపదార్థాలకు బానిసగా మారితే జీవితాలు నాశనమవుతాయని, యువత, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని గజపతినగరం సీఐ ఏ.వి.రమణ సూచించారు. మండలంలోని పురిటిపెంట గ్రామంలో ఆదివారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు.రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని చెప్పా రు. ప్రధానంగా యువత గంజాయి,మత్తుపదార్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వంటి జోలికి పోరాదని, లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దని సూచించారు. మైనర్లు, లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదన్నారు, శక్తి యాప్, పోక్సో, మహిళల రక్షణ చట్టాల గురించి వివరించారు. ఎస్ఐ కిరణ్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ

బొండపల్లి: కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, వాటికి వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురా లు వి.లక్ష్మి తెలిపారు. స్థానిక వనమిత్ర కేంద్రంలో వివిధ సంఘాలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయన్నారు. ఇవి రద్దు అయితేనే కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకుని, సమస్యలపై పోరాడడానికి అవకాశం ఉంటుందన్నారు.8 గంటల పని విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయడంతో పాటు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు హైమావతి,శాంతి, కనక, రామబంటు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలను తక్షణమే చెల్లించాలి

బొండపల్లి: ఉపాధి హామీ వేతనదారులకు మార్చి నెల నుంచి వేతనాలు అందడం లేదని, నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబ పోషణ సాగేదెలా అని గజపతినగరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పురం అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మార్చి 17వ తేదీ నుంచి ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి వేతనాలు అందలేదని పేర్కొన్నారు. పని చేసిన తర్వాత 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించా లని ఉపాధి హామీ చట్టంలో ఉన్నప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ చట్టాన్ని తుంగలోకి తొక్కిందని ఆరోపించారు. వేతనదారులకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే వేతనాలు జమచేయాలని, అలాగే రోజు వారీ వేతనం రూ.300 తక్కువ కాకుండా చూడాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

దత్తిరాజేరు: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్.భూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ సూచించారు. ఎస్.భూర్జవలసలో ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని తెట్టంగి, పాలాయవలస, తాతావారి కిట్టాలి గ్రామాలకు సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నారంనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాకేరులో విత్తనాల పంపిణీ

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న జగ్గయ్యపేటతో పాటు గుడివాడ రెవెన్యూ పరిధిలోని రైతులకు జాకేరు రైతుసేవా కేంద్రంలో వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ వేలిముద్రలు కూడా అక్కడే వేయాలని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక రామానాయుడు రోడ్డులో కొలువైన కోటసత్తెమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త ఒబ్బిలిశెట్టి వెంకటేశ్వర్లు ఉత్సవాలు ఆరంభించి, ఆలయ ఆవరణలో హోమాలు చేశారు. అనంతరం భక్తలంతా అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ పారాయణాలు, కుంకుమార్చనలు ఉంటాయని మంగళవారం సాయంత్రం పెద్దచెరువులో తెప్పోత్సవం, ఊరేగింపు ఉంటుందన్నారు.

గోరక్షక్ వీర్ పురస్కారం..


పురస్కారం అందుకుంటున్న పద్మనాభం

బొబ్బిలి: బొబ్బిలి ఉప ఖజానాధికారి పి.వి.పద్మనాభంను రాష్ట్రీయ గోరక్షక్ వీర్ పురస్కారం వరించిం ది. ఢిల్లీకి చెందిన శ్రీదేవి కల్యాణ సేవా ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. గోవుల సంరక్షణ, కబేళా ల మూసివేత వంటి కార్యక్రమాలతో సుమారు 500 గోవులను సంరక్షించడం, మూడు గోవధశాలల మూసివేయించినందుకు పద్మనాభంను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈయన ప్రస్తుతం 2 గోశాలలు నిర్వహిస్తున్నారు. గోరక్షక్ వీర్ పురస్కారం అందుకున్న పద్మనాభాన్ని స్థానికులు ఆదివారం అభినందించారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ పదో వార్షికోత్సవం


విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి


స్నపన తిరుమంజనం సేవలో స్వామి

వేపాడ: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పదో వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కిందట దాతలు, పెద్దలు, గ్రామస్తుల సహకారంతో 105 రోజుల్లో నూతన ఆలయం నిర్మించామన్నారు. నాటి నుంచి స్వామివారికి ప్రతిరోజూ సుప్రభాత సేవ, అర్చన.. ప్రతి శుక్రవారం స్నపన తిరుమంజనం.. శనివారం ప్రత్యేక పూజలు.. వైకుంఠ ఏకాదశి, మార్గశిర మాసం వంటి ప్రత్యేక పర్వదినాల్లో విశేష అర్చనలు చేడతామని చెప్పారు. వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాతసేవ, స్నపన తిరుమంజనం నిర్వ హిస్తామన్నారు. అలాగే 9.30 గంటల నుంచి అనకాపల్లికి చెందిన శ్రీమాన్ శ్రీరేజేటి గోప అప్పలాచార్యులు (చక్రవర్తి) వేదపండిత బృందంచే శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బొద్దాం - కళ్లెంపూడి రోడ్డును అభివృద్ధి చేయాలి


బొద్దాం-కళ్లెంపూడి రహదారిపై నిరసన తెలియజేస్తున్న జగన్, తదితరులు

- ఆందోళన చేపట్టిన స్థానికులు

వేపాడ: దశాబ్దాలు గడిచినా బొద్దాం - కళ్లెంపూడి రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ఏపీ రైతు సంఘ ఉపాధ్యక్షుడు జగన్ నేతృత్వంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. రహదారిపై నిలిచిఉన్న నీటిలో కూర్చుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. పదిహేనేళ్లుగా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రోడ్డుపై గజానికో గుంత ఏర్పడిందన్నారు. ఈ రహదారిపై బొద్దాం, ముకుందపురం, ఓబలయ్యపాలెం, కళ్లెంపూడి గ్రామాలకు చెందిన వారు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. గోతుల్లో పడి చాలా మంది ప్రమాదాల బారిన కూడా పడ్డారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇతర హైవేలంటూ నియోజకవర్గాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అధికారులు, పాలకులు అధ్వానంగా ఉన్న బొద్దాం - కళ్లెంపూడి రహదారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్, పి.నగేష్, సాయిరాం, బొద్దాం, ఓబలయ్యపాలెం, ముకుందపురం విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

• 98 మందికి నేత్ర పరీక్షలు


శస్త్రచికిత్సలకు బయలుదేరుతున్న రోగులతో వైద్య సిబ్బంది

వేపాడ: మండలంలోని పాటూరులో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బందిల రామకృష్ణ సహకారంతో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ కో ఆర్డినేటర్ ఎస్.జోగారావు మాట్లాడుతూ.. ఆప్తాలమిస్ట్ దేవీ, నర్స్ లావణ్య, తదితరులు 98 రోగులను పరీక్షించి 59 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారన్నారు. వీరికి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేస్తామని చెప్పారు.

29న సీఐటీయూ నాలుగో నగర మహాసభ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన సీఐటీయూ నాలుగో నగర మహాసభ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నగర అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, ఆర్.శంకరరావు, బి.రమణలు తెలిపారు. స్థానిక తోటపాలెం, ఎల్బీజీ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించి, మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సీఐటీయూ చేసిన పోరాటాలు, విజయాలను సభలో తెలియజేయడం జరుగుతుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, గురుమూర్తి, భాస్కరరావు, స్వప్న, రాజేశ్వరి, సురేష్, పైడిరాజు, రాజు, కృష్ణ, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక రేపు

మెంటాడ: మండలంలోని ఇద్దనవలస గ్రామంలో ఈనెల 17న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ అనంత రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.ఇద్దనవలస విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై వినతులు అందజేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

- వానాకాలంలో వ్యాధుల ముప్పు
- జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు వచ్చే ఆస్కారం
- జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

వర్షాకాలం.. తస్మాత్ జాగ్రత్త!



విజయనగరం: వేసవికాలం ముగిసి, వర్షాకాలం వచ్చింది. గత కొన్నిరోజులుగా వానలు దంచికొడుతున్నాయి. వానల కారణంగా ఏర్పడిన చల్లని వాతావరణం అందరికీ బాగానే అనిపిస్తుంది. కానీ ఇదే అన్ని కాలాల కన్నా ప్రమాదకరమని, జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వానాకాలంలో శీతల వాతావరణానికి జలుబు, దగ్గు, గొంతులో కఫం వంటి సమస్యలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డయేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రంగా పాటించాలని చెబుతున్నారు.

దోమలు వృద్ధి చెందకుండా..

వర్షాకాలంలో పడే వానలకు లోతట్టు ప్రాంతాలు, కాలువలు, రోడ్లు ఇలా ఎక్కడ పడితే అక్కడ నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం ఉంది. దీంతో అయా చోట్ల దోమలు వృద్ధి చెందుతాయి. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలుతాయి. ఇది జరగకుండా ఉండాలంటే వర్షపునీటి నిల్వల ప్రాంతాలు ముందుగానే గుర్తించి, అవి వరదనీటితో నిండగానే అక్కడ దోమలు పెరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి. అలాగే ఆహార పదార్థాలపై దోమలు, ఈగలు వాలకుండా చూసుకోవాలి. వర్షాల వల్ల భూగర్భ జలం మారే అవకాశం ఉన్నందున జలుబు, దగ్గు రాకుండా కాచివడపోసిన నీటిని తాగాలి.

చేపట్టాల్సిన చర్యలివే..


- కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు పారిశుధ్య పనులు సక్రమంగా చేయించాలి
- జనావాసాల వద్ద మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి
- దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలి
- ఇళ్లల్లోని తలుపులు, కిటికీలకు దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- నీటి టబ్బులు, డ్రమ్ములను రెండు, మూడు రోజులకోసారి శుభ్రంగా కడగాలి
- దోమతెరలు వినియోగించాలి
- కాచివడపోసిన నీటిని తాగాలి
- చిన్నారులు వానలో తడవకుండా చూసుకోవాలి
- ఆహారం కొంచెం వేడిగా ఉన్నప్పుడే తినాలి

చర్యలు చేపడుతున్నాం..

వర్షాకాలం మొదలైనందున సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ముఖ్యగా పారిశుధ్యం మెరుగుపరుస్తున్నాం. దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నాం. కాలువల్లో పూడికతీతలు, రోడ్డుపై చెత్తా చెదారం తొలగిస్తున్నాం.

కె.సాంబమూర్తి,
కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి, విజయనగరం

ఘనంగా ఫాదర్స్‌డే


పెద్దలను సత్కరిస్తున్న స్నేహం అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వెంకటసూర్యదుర్గా కల్యాణ మండపంలో 'స్నేహం' అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఫాదర్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పలు సంఘాలను ఆర్గనైజ్ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పట్టణానికి చెందిన అంబికా కోటేశ్వరరావు, బస్వా పంచముఖేశ్వరరావు, దాసరి అప్పా రావు, పెంకి గౌరీశ్వరరావు, కొల్లూరు సత్యనారాయణలను సత్కరించారు. స్నేహం అసోసియేషన్ కో-కన్వీనర్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ సన్మానగ్రహీతలు తండ్రి స్థానంలో ఉండి తమను సమాజసేవలో ముందుకు నడిపించడం గొప్పవిషయమని కొనియాడారు. కార్యక్రమంలో బి.వి.అచ్యుత్‌కుమార్, కొల్ల పార్థసారధి, కొత్తా మధుసూదనరావు, పెంకి చైతన్యకుమార్, నీలకంఠేశ్వర యాదవ్, గట్టి పాపారావు, కొత్తా ప్రకాష్, చీమకుర్తి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.